www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 10 జూన్ 2024

5

కాకినాడ



నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంకు చెందిన అడపా రామకృష్ణ, పార్వతి దంపతులు వారి కుమారుడు అడపా లక్ష్మీ నరసింహ రాజు పేరు మీద రూ.50 వేలు విరాళం అందచేశారు. సంబంధిత విరాళానికి చెందిన చెక్కును ఆలయ గుమస్తా గుర్రాజుకు అందచేశారని ఆలయ ఇఒ బళ్ళ నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ అర్చకులు స్వామి చిత్రపటం, రసీదును, వేద ఆశీర్వచనాలు అందజేశారు.



దాతకు స్వామి చిత్రపటం అందిస్తున్న అర్చకులు

నిబంధనలకు తూట్లు..!

- ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడి
- యథేచ్ఛగా అధిక ధరలకు పుస్తక విక్రయాలు
- పట్టించుకోని విద్యా శాఖ అధికారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రతి ఏటా పలు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా వివిధ రూపాల్లో సొమ్ములు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే రూ.వేలల్లో ఫీజుల రూపంలో బాదేస్తుండగా విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ విద్యాసంస్థల్లోనే పుస్తకాలను విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకూ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలకు కలిపి రూ.7 వేలు నుంచి రూ.15 వేలు వరకూ ఖర్చు చేయాల్సి వస్తుందని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా యాజమాన్యాల వద్దే తప్పనిసరిగా కొనుగోలు చేయాలనే అనధికారిక నిబంధనలు పెడుతుండడంతో భారంగా మారుతోందని చెబుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ప్రయివేటు విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాలను విక్రయించాలని నోట్ పుస్తకాలు, ఇతర వస్తువులు అమ్మరాదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా యాజమాన్యాలు పెడ చెవినే పెడుతున్నాయి.



ఇష్టారాజ్యంగా

ప్రభుత్వ పాఠశాలలో 1నుంచి 10వ తరగతి వారికి ఉచితంగా, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలలకు తరగతుల వారీగా ప్రభుత్వం గతేడాది పుస్తకాల ధరలను నిర్ణయించింది. ఈ ఏడాది ఇంకా ప్రకటన రాలేదు. 1 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంకు రూ.326 నుంచి 657 వరకూ, ఇంగ్లీషు మీడియంకు రూ.280 నుంచి 674 వరకూత మాత్రమే పాఠ్యపుస్తకాలను విక్రయించాల్సి ఉంది. కానీ పలు యాజమాన్యాలు విద్యాహక్కు చట్టాన్ని పక్కన పెట్టి భారీగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల జేబులను ఖాళీ చేస్తున్నాయి. అదే సందర్భంలో పుస్తకాలను తమ వద్దే కొనుగోలు చేయాలని తేల్చి భారీగా ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. నోట్ బుక్స్, షూస్, టై, యూనిఫామ్ ఇలా విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల వస్తువులు అక్కడే కొనుగోలు చేయాలని చెబుతూ భారీగా దండుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు 10 నుంచి 20 శాతం అదనంగా పుస్తకాల కోసం వసూలు చేస్తున్నారు.

పట్టని విద్యాశాఖ

జిల్లాలో పలు ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు భారీగా ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తుండడమే కాకుండా పుస్తకాల పేరుతో వేలల్లో సొమ్ములు గుంజుతున్నా విద్యాశాఖ అధికారులు కనీసంగా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఫిర్యాదులు అందిస్తున్నా తూతూ మంత్రపు చర్యలతో సరిపెడుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరమైనా విద్యా హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలయ్యేలా అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

అధికారుల చర్యలు శూన్యం

విద్య హక్కు చట్ట ప్రకారం ప్రయివేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ అమ్మకాలు చేయకూడదు. కానీ చాలా పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ అధిక రేట్లకు అమ్ముకుంటున్నారు. ఏ పాఠశాల పేరు మీద ఆ పాఠశాల పుస్తకాలనే అమ్ముతూ తమ పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నారు. ఇది సరికాదు. వెంటనే అధికారులు సరైన చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఆందోళన చేపడతాం.

ఎం.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి, కాకినాడ జిల్లా

వన్నెపూడి ఉదంతంపై ఆరా

-కార్యకర్తలు సంయమనం పాటించాలి

-జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

'పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని వన్నెపూడిలో ఇటీవల జరిగిన ఉదంతం పార్టీ దృష్టికి వచ్చింది. ఆ సంఘటనపై వివరాలను సేకరిస్తున్నాం. పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటాం. ఎవరు తప్పు చేసినా ఉపేక్షించేది లేదు' అని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు స్పష్టం చేశారు. వన్నెపూడిలో జరిగిన ఘటన నేపథ్యంలో ఆదివారం ప్రజాశక్తిలో 'వర్మ వర్సెస్ జనసేన' శీర్షిక పేరుతో వార్తా కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఈ మేరకు నాగబాబు ఓ ప్రకటనను విడుదల చేశారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జరిగిన సంఘటన గురించి కూడా పిఠాపురం కో ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ నేతృత్వంలోని స్థానిక నాయకులు చర్చించుకుని నిర్ణయం తీసుకుంటారన్నారు. జన సైనికులంతా సంయమనం పాటించాలని కోరారు. పవన్ కళ్యాణ్ ఎన్‌డిఎలో కీలక భూమిక పోషిస్తున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో చక్కబెట్టాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయని, చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం, ఇంకో వారం రోజుల్లో పవన్ కళ్యాణ్ పిఠాపురం రానున్నారన్నారు. కో ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ పిఠాపురంలో అందరికీ అందుబాటులో ఉంటారన్నారు. ప్రజల సమస్యలు తీర్చడానికి అందుబాటులో ఉండే విధంగా పిఠాపురంలో జనసేన నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే అందరం కూర్చొని పరిష్కారం అయ్యేవిధంగా ప్రణాళికలు రూపొందించుకుందామని జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీకి జట్టు ఎంపిక

ప్రజాశక్తి - పిఠాపురం

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్ఆర్‌బి హెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలను పిఠాపురం మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ కొత్తపల్లి పద్మ, కౌన్సిలర్ పి.నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఈ పోటీలకు చింతూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, పిఠాపురం, కిర్లంపూడి తదితర ప్రాంతాల నుంచి 150 మంది ఆర్చర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 30 మందిని ఎంపిక చేసినట్టు వారు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 24 వరకు విజయవాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున పాల్గొంటారన్నారు. పోటీలు అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు, పిఠాపురం మున్సిపల్ కౌన్సిలర్ అల్లవరపు నగేష్, జనసేన నాయకులు మార్నీడి రంగబాబు, ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, వీరబాబు, టిడిపి నాయకులు వి.రామరాజు బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కె.చిన్నబ్బాయి, జి.శివప్రసాద్, పి.కృష్ణ వ్యవహరించారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో నిర్వాహకులు

ముంపు నివారణకు యాక్షన్ ప్లాన్ అవసరం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని ముంపు నివారణకు యాక్షన్ ప్లాన్‌ను తక్షణమే చేపట్టాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మురుగు కాలువల స్లాబురాళ్ళు తొలగింపు, పూడిక తీత వల్ల ముంపు తీవ్రత తొలగదని ఆయన అభిప్రాయపడ్డారు. 2010, 2021లో మురుగుతోపాటు గాలేరు, ఏలేరు, బిక్కవోలు సాగు నీటి కెనాల్స్‌లో ఎగువ నుంచి వచ్చే గోదావరి వరద నీరు సముద్రంలోకి కలవడంలో ఎదురవుతున్న అవరోధాల వల్ల ముంపు సిటీగా మారిందన్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి, రెవెన్యూ, ఏలేరు మేజర్ సాగునీటి ఇరిగేషన్ పిడబ్ల్యూడి జలవనరుల శాఖ, పోర్ట్ రైల్వే శాఖల సమన్వయంతో సమీక్ష చేపట్టాలన్నారు. మెయిన్ రోడ్ సినిమా రోడ్డులోని ఆర్ అండ్ బి కల్వర్టులు తూములుగా మారి పడమర నీరు తూర్పు డ్రెయిన్లకు చేరడం లేదన్నారు. అధికారుల మధ్య సమన్వయం లేక నగర ప్రజలకు ఉప్పుటేరు ముంపు తప్పడం లేదన్నారు. ప్రతి ఏటా మూడు ఫోటోలు, ఆరు వీడియో క్లిప్పింగ్స్ మాదిరిగా స్లాబురాళ్ళు పూడికలు పోగేసే కంటితుడుపు పనుల వలన ఆకర్షణీయ నగరం కాదన్నారు. ప్రజా నివాసం, వ్యవసాయ వినియోగం లేని భూములు సేకరించి డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేలా ప్రణాళికను రూపొందించాలని సూచించారు. శాశ్వత ముంపు నివారణకు నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

జెఇఇ ఫలితాల్లో కెఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట

తాజాగా విడుదలైన జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో సామర్లకోట కెఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపర్చారు. కళాశాలకు చెందిన తమ విద్యార్థులు డేరా జీవన్ కుమార్ రెడ్డి 1097వ ర్యాంకు, సానిపిని వర్షినిసాయివిశిష్ట 5433వ ర్యాంకు సాధించి ఐఐటిలో సీట్లు కన్ఫర్మ్ చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రాధాకృష్ణ ఆదివారం చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను, బోధించిన అధ్యాపకులను, సహకరించిన తల్లిదండ్రులను కళాశాల డైరెక్టర్లు శ్రీను, ఎం.వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ కెవి.కుమారి అభినందించారు.





నెహ్రూ విజయంతో మొక్కు తీర్చుకున్న శ్రేణులు

ప్రజాశక్తి - గండేపల్లి

జగ్గంపేట నియోజకవర్గ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూకు మంత్రిత్వం వచ్చేలా చేయాలంటూ అన్నవరం రత్నగిరికి పాదయాత్ర చేపట్టారు. మండలంలోని జెడ్ రాగంపేట గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కందుల కొండయ్య చౌదరి ఆధ్వర్యంలో సుమారు 60 మంది కార్యకర్తలు రాగంపేట గ్రామం నుంచి ఆదివారం ఉదయం పాదయాత్రను ప్రారంభించారు. వీరికి జగ్గంపేటలో రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కొత్త కొండబాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అఖండ విజయం సాధించాలని అన్నవరం పాదయాత్ర మొక్కు కోవడం జరిగిందని, అలాగే జ్యోతుల నెహ్రూకు మంత్రివర్గంలో స్థానం కల్పించేలా ఆశీర్వదించాలని కోరుతూ పాదయాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుల బాబ్జి, ఉండవల్లి వరప్రసాద్, కందుల విశ్వేశ్వరరావు, బుద్దాల శ్రీను, బొడ్డు సూరిబాబు, దేవరపల్లి వెంకటేష్, కొడత బుజ్జి, అలమండ లక్ష్మణ్ మహిళలు పాల్గొన్నారు.



అన్నవరంకు పాదయాత్రగా వెళ్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

కొలిక్కిరాని జీర్ణోద్ధారణ పనులు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో శివలింగానికి జరుగుతున్న జీర్ణోద్ధారణ పనులు ఒక కొలిక్కి రాలేదు. దీంతో భీమేశ్వరుని అంతరాలయం శివలింగ దర్శనాలు ఈనెల 16 వరకూ నిలుపుదల చేసి, 17వ తేదీ సోమవారం నుంచి దర్శనాలకు అనుమతిస్తామని ఆలయ ఇఒ భళ్ల నీలకంఠం చెప్పారు. శివలింగ జీర్ణోద్ధారణ పనులు కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో గతనెల 28 నుంచి నిర్వహిస్తున్న విషయం విధితమే. ముందుగా ప్రకటించిన మేరకు ఈ నెల 8 వరకూ శివలింగ దర్శనాలు నిలిపివేసిన విసయం విధితమే. అయితే శివలింగం జీర్ణోద్ధరణ పనులు పూర్తిస్థాయిలో నిర్వహించుటకు పానమట్టం ఆటంకంగా ఉండడంతో పనుల్లో జాప్యం అవుతున్నట్లు సమాచారం. కాగా నిర్దేశించిన మేరకు పనులు పూర్తికానందున 16వ తేదీ వరకూ చేసి, తదుపరి సంప్రోక్షణ చర్యలు పూర్తిచేసి, 17న సోమవారం ఏకాదశి నుంచి గర్భాలయం పున్దర్శనం భక్తులకు ఏర్పాటుచేస్తామని ఇఒ తెలిపారు. భక్తులు గమనించి దేవదాయ, పురావస్తుశాఖలకు సహకరించాలని ఇఒ కోరారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థుల బృందం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొమరగిరి గ్రామంలో స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో 2000-01 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. 24 సంవత్సరాల తరువాత వారికి విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను ఒకే వేదికపై తీసుకొచ్చారు. పూర్వ విద్యార్థులు అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నెమరు వేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాల తీపి కబుర్లు, తమ అనుబంధాలను స్మరించుకున్నారు. ఒకరికొకరు చెప్పుకుంటూ సెల్ఫీలు తీసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు. పూర్వ విద్యార్థులు అధ్యాపకులకు శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులను ఒక చోటకు తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేసిన పూర్వ విద్యార్థులు కాదులూరి సుబ్బలక్ష్మి, కృష్ణవేణి, ప్రకాష్‌రెడ్డి, రమణ, అధ్యాపకులతోపాటు పూర్వ విద్యార్థులు శాలువాతో సన్మానించి అభినందించారు.



ఎంఎల్ఎ సత్యప్రభను సత్కరిస్తున్న అభిమానులు

సత్యప్రభకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఎంఎల్ఎగా విజయం సాధించిన వరుపుల సత్యప్రభకు అభినందనల వెల్లువ కొనసాగుతూనే ఉంది. ఆదివారం ఏలేశ్వరం నుంచి వార్డ్ కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు వివిధ వాహనాలపై తరలివెళ్లి సత్యప్రభకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు రాయుడు చిన్న, పెంద్ర శ్రీను, ఎండగుండి నాగబాబు, కోణాల వెంకటరమణ పాల్గొన్నారు.

నానాజీకి పాత్రికేయుల అభినందన

ప్రజాశక్తి - కరప

కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎంఎల్ఎగా విజయం సాధించిన పంతం నానాజీకి మండలంలోని పలువురు పాత్రికేయులు కలిసి అభినందనలు తెలిపారు. నగరంలోని గుడారుగుంటలోని ఆయన స్వగృహంలో వారు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయ మిత్రులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు భోగిరెడ్డి కొండబాబు, భోగిరెడ్డి గంగాధర్, యాళ్ల పండు, పాత్రికేయులు ఎస్.శ్రీనుబాబు, బి.రాంప్రసాద్, జి.శోభన్‌బాబు, టి..సత్తిబాబు, ఎం.బాబులు, ఎం.దొరబాబు, వల్లి బాబు పాల్గొన్నారు.



నానాజీకి మొక్కను అందిస్తున్న పాత్రికేయులు

లక్ష్మీపతిపురంలో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం గాడిమొగ పంచాయతీ లక్ష్మీపతిపురంలో ఆదివారం టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు విజయం సాధించిన సందర్భాన్ని పురష్కరించుకుని కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం ఎంఎల్ఎ సుబ్బరాజు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యుడు మల్లాడి వరదరాజు, నాయకులు సంగాడి కామేశ్వరరావు, రేకాడి రామారావు, చెక్కాశివ, ఇల్లింగి బాలరాజు, అంగాడి తాతారావు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



దాట్ల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి శ్రేణులు

హుస్సేన్‌పురంలో భారీ అన్నదానం


ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్‌పురం మదుగులమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. జాతర మహోత్సవం ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద మహా అన్నదానం చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు ఈ జాతర మహోత్సవం సందర్భంగా స్వగ్రామానికి చేరుకుని మదుగులమ్మను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఉత్సవాల ముంగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో వేలాది మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కోటా అప్పారావు, మార్ని నాగరాజు, చల్లా కొండ, కోటా వెంకన్న, చల్లా బుజ్జి, పుప్పాల నాయుడు, పుప్పాల శ్రీను, పుప్పాల అప్పారావు, ఎవర్న సూరిబాబు, మార్ని వీరాజు, మార్ని సూర్యారావు, మార్ని రాజు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వహకులు

కార్టూ'నిజం'



యజమానుల తీరు మారదు..

-ట్రాఫిక్ సమస్య పోలీసులకు పట్టదు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణం రోడ్డు రవాణాలో కాకినాడ జిల్లాలోనే అతి కీలకమైన ముఖ్య కూడలి ప్రాంతం. ఇటు రైల్వే స్టేషన్, అటు బస్ స్టేషన్‌లు ఎదురెదురుగా ఉన్న ఏకైక పట్టణం ఇది. దానికి మించి ఒకవైపు రాజమహేంద్రవరం, మరోవైపు ద్వారపూడి, కడియం ప్రాంతాలకు, మరోవైపు ఏలేశ్వరం, రంపచోడవరం, అడ్డతీగల వంటి మండలాలకు, పిఠాపురం మీదుగా కత్తిపూడి మీదుగా విశాఖపట్నం ప్రధాన నగరాలకు వెళ్లే రహదారుల కూడలిగా సామర్లకోట పట్టణానికి ప్రాధాన్యత ఉంది. ఇక్కడ ట్రాఫిక్ అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో తరచూ రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉంది. స్థానిక పోలీస్‌స్టేషన్లో నమోదవుతున్న కేసుల సంఖ్య ఇందుకు ఉదాహరణ.

సామర్లకోటలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. అయితే పట్టణంలో ఇటీవల పలు వాహనాలను రోడ్డు మార్జిన్‌లను ఆనుకుని పార్కింగ్ చేయడం వలన ప్రమాదాలకు నిలయాలుగా ఆ ప్రాంతాలు మారుతున్నాయి. అసలే ఇరుకు రోడ్డులు అయినందున రెండు భారీ వాహనాలు ఎదురేదురుగా వస్తే తప్పుకోవడమే కష్టతరం. ఈ తరుణంలో రోడ్డు మార్జిన్‌లలో వాహనాలను నిలిపి ఉంచడంతో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయి. స్థానిక పెద్దాపురం రోడ్డులోని ప్రసన్నంజనేయ స్వామి ఆలయం సెంటర్లో రోడ్డు మార్జిన్‌ను ఆనుకుని పలు లారీలు నిలిపి ఉంచడంతో ఒక ఆర్‌టిసి బస్సు ఒక ట్రాక్టర్‌లు తప్పించుకునే స్థలం లేక ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఆ సమయంలో పోలీసులు రోడ్డు పక్కన ఉన్న వాహనాలను తొలగిస్తూ ఇకపై రోడ్డు మార్జిన్‌లలో భారీ వాహనాలు నిలుపరాదనీ హెచ్చరించడం జరిగింది. దీంతో తాత్కాలికంగా వాహన యజమానులు వారి వాహనాలను అక్కడ నుంచి తొలగించారు. తిరిగి యథాతదంగా వారి వాహనాలను రోడ్డుకు ఇరువైపులా వరుసగా నిలుపుతుం డటంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ఆ సెంటర్‌లో ప్రసన్నఆంజనేయ స్వామి, పాండురంగ ఆలయాలతోపాటు విటికర్ బాలికల ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. దానితో విద్యార్థులు, భక్తులతో ఈ సెంటర్ నిత్యం రద్దీగా కని పిస్తోంది. ఇంకా ఈ సెంటర్ మీదుగానే ప్రత్తిఎ ాడు, శాంతిఆశ్రమం, కిర్లంపూడి, కత్తిపూడి వంటి గ్రామాలకు వెళ్లే ఆర్‌టిసి బస్సులు, ఆటోలు మలుపు తీసుకుని వెళ్ళాల్సి ఉంది. అలాంటి సమయాల్లో విటికర్ బాలికోన్నత పాఠశాల ప్రహరీని ఆనుకుని భారీ వాహనాలు నిలిపి ఉంచుతుండటంతో స్థలం సరిపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. కేవలం ప్రమాదం జరిగిన సమయాల్లో మాత్రమే ట్రాఫిక్ పోలీసులు స్పందిస్తున్నారు. మిగిలిన సమయాల్లో పట్టించుకోక పోవడంతో రోడ్డు మార్జిన్‌లలో వాహన యజమానులు నిర్లక్ష్యంగా నిలిపివేస్తున్నారు. ప్రమాదాలకు నిలకంగా మారిన ఈ సెంటర్లో నిలుపుతున్న భారీ వాహనాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ప్రసన్నాంజనేయ సెంటర్లో రోడ్డుపై నిలిపిన లారీలు

రామోజీరావు సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తెలుగు పత్రిక రంగంలో విశేష సేవలు అందించిన రామోజీరావు సేవలు ఎనలేనివని ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుత్తుల మల్లేశ్వరరావు అధ్యక్షతన రామోజీరావు సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొని రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, ఎఎంసి ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, నాయకులు మందాల గంగ సూర్యనారాయణ, రాయుడు గంగాధర్, టేకుమూడి లక్ష్మణరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు, పాత్రికేయులు పాలిక శ్రీనివాస్, ఫణి, వెంకటేష్, గిరి, గణేష్, రాంప్రసాద్ పాల్గొన్నారు.



సంతాప సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ సుబ్బరాజు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు



సీజ్ చేసిన బియ్యం లారీతో అధికారులు, సిబ్బంది

రేషన్ బియ్యం లారీ పట్టివేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ, ఆలమూరు రోడ్డులో అక్రమంగా పిడిఎస్(రేషన్ బియ్యం) రవాణా చేస్తున్న లారీని విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు సంయుక్తంగా ఆదివారం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ లారీని తనిఖీ చేయగా వాహనంలో 480 బస్తాల్లో సుమారు 23,500 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. పిడిఎస్ బియ్యంను కాకినాడ నగర పరిధిలోని జగన్నాధపురానికి చెందిన ఎస్.నరసింహమూర్తి లారీలో భీమవరం జిల్లా పాలకోడేరు మండలంలోని శృంగవక్షంకు చెందిన కనక దుర్గా రైస్ ట్రేడర్స్ నుంచి కాకినాడ లవన్ ఇంటర్నేషనల్‌కు రవాణా చేస్తున్నారు. సుమారు రూ.18,69,250 విలువ గల 23,500 కేజీల పిడిఎస్ బియ్యాన్ని, వాహనాన్ని మండల సివిల్ సప్లయ్స్ అధికారులు సీజ్ చేసి 6-ఎ క్రింద కేసు నమోదు చేశారు. అక్రమ రవాణా చేయుచున్న సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు కొరకు స్థానిక పోలీసు స్టేషన్ కు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఎస్‌పి కెఎస్ఎస్‌వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పిడిఎస్ అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఎవ్వరైనా పిడిఎస్ కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు జగన్నాధరెడ్డి, వలి, కిషోర్, సిఎస్‌డిటి అలీషా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

46 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం గ్రామంలో ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వద్ద చేసిన తనిఖీల్లో ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 46 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు నిర్వహిస్తుండగా చొల్లంగి వెంకటరమణ అనే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేశారు. దీంతో అతని నుంచి 46 మద్యం సీసాల తోపాటు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని తాళ్ళరేవు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్స్ రాజు, రామకృష్ణ, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో ఉన్న మహిళ ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి - కరప



పెనుగుదురు గ్రామంలో బస్ స్టాండు సెంటర్‌లో అపస్మారక స్థితిలో ఉన్న మహిళను పోలీసులు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని మహిళ రావులపాలెం బస్టాండ్‌లో బస్సు ఎక్కి పెనుగుదురు సెంటర్లో బస్సు నుంచి దిగుతూ కింద పడిపోయింది. ఆ బస్సులో ఉన్న వారు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించారు. ప్రస్తుత ఆ మహిళ వివరాలు ఏమీ తెలియలేదని, ఫోటో లో ఉన్న ఆమె వివరాలు తెలిస్తే 9440796557 నెం బర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ టి.రామకృష్ణ కోరారు.

జెసిబి, మూడు ట్రాక్టర్లు సీజ్


ప్రజాశక్తి-గోపాలపురం

ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులు, కాలువలోఓల అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని ఎస్ఐ కె.సతీష్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రాంపాలెంలో జల వనరుల శాఖకు చెందిన బాలంకి చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి, రవాణా చేస్తున్నట్టు వచ్చిన సమాచారంపై ఒక జెసిబి, మూడు ట్రాక్టర్లను ట్రక్కులతో సహా సీజ్ చేం పోలీస్ స్టేషన్ తరలించినట్టు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు.

ప్రమాణ స్వీకార పూజలో ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి-మండపేట

టిడిపి అధినేత చంద్రబాబు 4వసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారోత్సవానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్న కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, కేసరపల్లి సభా స్థలిలో రాజానగరం మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు.



దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుందుల సత్యనారాయణ

ఎంఎల్ఎ దుర్గేష్‌ను కలిసిన 'కుందుల'

ప్రజాశక్తి-పెరవలి

నిడదవోలు నియోజకవర్గంలో భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన జనసేన పార్టీ, కూటమి బలపరిచిన అభ్యర్థి, ఎంఎల్ఎ కందుల దుర్గేష్‌ను ఆదివారం టిడిపి సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ అభినందించారు. ఆయన వెంట, నిడదవోలు పట్టణ మాజీ టిడిపి అధ్యక్షుడు గూడపాటి వెంకట్రావు, టిడిపి పోలవరం నియోజకవర్గఅబ్జర్వర్ అనపర్తి వెంకట నారాయణ పాల్గొన్నారు

ఓణీల వేడుకలో ఎంఎల్ఎ దుర్గేష్

ముక్కామల గ్రామంలో వేండ్ర వెంకటేశ్వరరావు మనవరాలు ఓణీల వేడుక ఫంక్షన్‌లో ఎంఎల్ఎ కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల సురేంద్ర, వీరేష్ బాబు, వేండ్ర బాలాజీ, వేండ్ర వెంకటరమణమూర్తి నాయకులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ లే అవుట్లు

-ప్రభుత్వ ఆదాయానికి గండి
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ప్రయివేటు లే-అవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పంట పొలాలను ఇళ్ల స్థలాలుగా మార్చాలంటే కన్వర్షన్ తప్పనిసరిగా ఉండాలి. అయితే కన్వర్షన్ జరగకుండానే అడ్డదారుల్లో లే అవుట్లను వేసి విక్రయాలను చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతోంది. అయినా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై వెనుక ముడుపులే కారణమనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మండలంలోని పొన్నాడ, మూలపేట, గోర్స, కొమరగిరి, అమీనాబాద్ తదితర గ్రామాల్లో అనుమతి లేని లేఅవుట్లు వెలుస్తున్నాయి. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకున్నా ఏర్పాటు చేస్తున్న లే అవుట్‌లలో మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నారు. ఈ పనులన్నీ ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు పలిక జరుగుతున్నాయంటే ఏ స్థాయిలో అధికారులకు అమ్యామ్యాలు అందుతున్నాయో అర్థం



పొన్నాడ గ్రామంలో అనుమతి లేకుండా వేస్తున్న లే అవుట్

చేసుకోవచ్చు. ఈ లే అవుట్లకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? లేవా? అనే దానిపై అవగాహన లేని కొనుగోలుదారులు చేతులు కాలాకా ఆకులు పట్టుకున్నట్లు ఆ లే అవుట్లను కొనుగోలు చేసి విషయం తెలిసిన తరువాత లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ అనుమతి లేని లే అవుట్‌లో గృహాలు నిర్మించుకోవాలంటే కొనుగోలుదారులే అదనంగా సొమ్ములు వెచ్చించి బెటర్‌మెంటు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అక్రమ లేఅవుట్‌లు ఏర్పాటు చేస్తున్నప్పుడు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా రాజకీయ వత్తిళ్లతో వారు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. లే అవుట్‌లో అప్పుచేసి లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకోవాలంటే పంచాయితీకి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించాలని అధికారులు మాత్రం ఆదేశాలు జారీ చేస్తున్నారు. మండలంలోని పొన్నాడ, మూలపేటలో ఏర్పాటులో చేసిన అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లే అవుట్‌లపై పొన్నాడ గ్రామ కార్యదర్శి వివరణ కోరగా లే అవుట్‌లకు ఏటువంటి అనుమతులు లేవని తెలిపారు. ఇప్పటికే ఏర్పాటు దారులకు నోటీసులు పంపామని, అలాగే వుడా (వైజాగ్ అర్బన్ డెవలప్ అథారిటీస్)కు సమాచారం అందించామన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా ఏర్పాటు చేస్తున్న లే అవుట్లపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటంతోపాటు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించేలా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



మూలపేట గ్రామంలో అనుమతి లేకుండా వేస్తున్న లే అవుట్

దిగజారుతున్న పారిశుధ్యం

-పందుల స్వైరవిహారం
-ఆందోళనలో పట్టణ ప్రజలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండల కేంద్రమైన ఏలేశ్వరం నగర పంచాయతీలో పారిశుధ్యం దిగజారుతోంది. పట్టణంలో ఎక్కడ చూసినా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందులను రోడ్లపైకి వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నా హెచ్చరికలను సంబంధిత పందుల యజమానులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పుడు ఒకటి, రెండు రోజులపాటు పందులను కట్టివేస్తున్నారని, తరువాత యథావిధిగా వదిలివేస్తున్నారు. దీంతో పందులు పట్టణంలో స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ పందుల వల్ల అంటు వ్యాధులు ప్రభల్లే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటికితోడు ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోవడం, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండటంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. పట్టణంలో నూతన డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టకపోవడం పాత డ్రెయినేజ్‌లు శిధిలావ్యవస్థకు చేరడంతో వర్షాలు పడితే నీరు ఎక్కడపడితే అక్కడే నిలిచిపోయే పరిస్థితులు నెలకున్నాయి. రానున్న వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగూ, వంటి అంటు వ్యాధులు



పేరుకుపోయిన చెత్తలో పందులు

ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ అధికారులు ఇప్పటికైనా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే పందులు పట్టణంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆత్రేయపురంలో పనులు చేస్తున్న వేతనదారులు

ఉపాధి పనులకు అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా చేస్తున్న పనులను క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. ఎపిఒ భారతి పనులు చేసే సమయంలో పర్యవేక్షించిన దాఖలాలు ఎక్కడా లేవని వేతనదారులే చెబుతున్నారు. పనులు చేసే సమయంలో వారికి కల్పించవలసిన కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోగా వారి ఇబ్బందులు చెప్పుకోవాలంటే వినే నాథుడే కురువయ్యాడని వేతనదారులు చెబుతున్నారు. ఒకపక్క కొలతల ప్రకారం పనులు సక్రమంగా చేస్తున్న పూర్తి వేతనం రావట్లేదు అంటూ వేతన్దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి దష్ట్యా వారికి కల్పించవలసిన కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో వేతనదారులు ఇబ్బందులు వర్ణనాతీతం. వేతనదారులు పనులు చేసే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తప్ప మరి ఏ అధికారి పనులను పరిశీలించిన దాఖలాలు లేవు.

రూ.250పైబడి వేతనం అందట్లేదు

వేతనదారులు పనులు చేసే సమయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎపిఒ, క్లస్టర్ ఎపిడి పనులను పరిశీలించి వారికి పూర్తి వేతనం మూడు వందల ఇరవై రూపాయలు అందేలా చూడాలి. కానీ. రెండు వందల యాభై రూపాయలు పైబడి రావట్లేదు అంటూ వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగచేసుకుని వేతనదారులకు పూర్తి వేతనం వచ్చేలా పనులు కల్పించాలని పలువురు కోరుకుంటున్నారు.



ఇటీవల కురిసిన వర్షానికి పాశర్లపూడిలో రహదారిపై గోతుల్లో చేరిన మురుగునీరు

ప్రమాదకరంగా రహదారిపై గోతులు

- **వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు**
- **మురుగునీరు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని వినతి**

ప్రజాశక్తి- మామిడికుదురు


మండలంలోని పాశర్లపూడి అమ్మ సూపర్ మార్కెట్ నుండి కైకాల పేట వరకు కిలోమీటర్ వరకు 216వ జాతీయ రహదారి లో నాలుగు చోట్ల ఏర్పడిన గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల వాసులే కాకుండా పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, భీమవరం నుంచి వచ్చే వాహనాల రాకపోకలతో ఈ రహదారిపై గోతులు, మురుగు నీరు నిలువతో అధ్వానంగా మారింది. దీంతో వాహనచోదకులకు అవస్థలు తప్పడంలేదు. ఇదే రహదారిలో మామిడికుదురులో రెండు చోట్ల రోజుల తరబడి మురుగు నీరు తిష్ట వేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుపై తిష్ట వేసిన మురుగనీరు మళ్లించేలా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రముఖ వ్యాపార వేత్త, రామోజీ గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావుకి మృతికి పలువురు సంతాపం తెలిపారు. రామోజీరావు అనారోగ్యంతో ఈ నెల 8న మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అమలాపురం రూరల్ : రామోజీరావుకి నా చిత్ర నివాళి అంటూ అమలాపురానికి చెందిన చిత్రకారుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వాటర్ కలర్స్ ఉపయోగించి ఆదివారం రామోజీ చిత్రాన్ని పెయింటింగ్ వేశారు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రామోజీరావు స్థాపించిన రామోజీ గ్రూప్ ఆధీనంలో ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిలిం సిటీ ఉందన్నారు. **కాట్రేనికోన:** రామోజీరావు మృతి రాష్ట్రానికి, మీడియా రంగానికి తీరని లోటు అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నాగిడి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటని ఆయన అన్నారు. కార్యక్రమంలో కముజు లక్ష్మీ రమణారావు, విత్తనాల బుజ్జి, వాసంశెట్టి రాజేశ్వర రావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్తాల ప్రసాద్, మోకా అప్పాజీ, మండల మహిళా అధ్యక్షురాలు మాదే యోగేశ్వరి, ఎం.సత్యనారాయణ మూర్తి తది తరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** రామోజీరావు ఆకస్మిక మృతికి చింతిస్తూ ఆదివారం సాయంత్రం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం నందు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెరిడేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యంలోకొత్తపేట నియోజకవర్గ పాత్రికేయులు, నియోజకవర్గ ఎపిడబ్ల్యుజెఎఫ్ కమిటీ సభ్యులు తదితరులు రాజమోజీరావు చిత్రపటానికి నివాళులార్పంచారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.బంగారు రాజు ,నియోజకవర్గ అధ్యక్షులు వాకాడ బాబులు, సెక్రటరీ పి.చంటి, ఉపాధ్యక్షులు డి.గనిరాజు, ట్రెజరర్ యు.సురేష్, కార్యవర్గ సభ్యులు కెవివి.సత్యనారాయణ, పి.రాజు, కనికిరెడ్డి, ఎన్.నాని ,ఎన్ శ్రీను, ఎన్ రమేష్ , బి.పెద్దిరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** రామోజీరావు మృతి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. మామిడికుదురు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రామోజీరావు కి నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు పత్రికా రంగంలో ఎనలేని కృషి చేసి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్న రామోజీరావు మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నయినాల సత్య దుర్గా ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ అమీర్ హాసన్, కోశాధికారి ఏడిద బాలకృష్ణారావు, జాయింట్ సెక్రటరీ గుబ్బల హరిబాబు, సభ్యులు కడియం త్రినాథ స్వామి, తోరం సత్యనారాయణ, ఏడిద లోకేష్, స్థానికులు నయినాల సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటం



కాట్రేనికోనలో రామోజీ చిత్రపటం వద్ద పలువురు నివాళి

కక్షసాధింపు చర్యలే వైసిపి అజెండా

ప్రజాశక్తి-కొత్తపేట

దాడులు, విధ్వంసం, కక్ష సాధింపు చర్యలు వైసిపి నేతలు అజండా అని టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి విమర్శించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బాధ్యత గల ప్రతిపక్షంగా వైసిపి నేతలు సూచనలు చేస్తే టిడిపి స్వీకరిస్తుందన్నారు. గత ఐదేళ్లుగా కొత్తపేట నియోజకవర్గంలో జరిగిన పాలనా తీరు భావితరాలకు కనువిప్పు కావాలని వాడపల్లి వెంకన్నఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది, యాత్రికులను ఆకట్టుకునే కార్యక్రమాలు చేపట్టింది బండారు సత్యానందరావు గుర్తు చేశారు. వాడపల్లి ఆలయంలో యాత్రికుల సౌకర్యార్థం అన్నదాన భవనం గాని, కళ్యాణ మండపం కొరకు స్థల సేకరణ చేసింది అప్పటి పాలకవర్గమేనని అన్నారు. బైపాస్ రోడ్డు నిర్మించింది టిడిపి ప్రభుత్వంలో హయాంలోనేని అన్నారు. ఈ ఐదేళ్లలో మీరేం చేశారో అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంతోపాటు, అభివృద్ధిని ముందుకు తీసుకు వెళ్ళడంలో చంద్రబాబు సారధ్యంలో సత్యానందరావు విజయవంతంగా పని చేస్తారని అన్నారు.

యానాం వార్తలు

బిఎస్‌సి నర్సింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - యానాం

బిఎస్‌సి నర్సింగ్ కోర్సుకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం తిరిగి మళ్లీ సెంటాక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్‌సి కోర్సులో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించాల్సి ఉందని, ప్రభుత్వ కోటా అడ్మిషన్ల ప్రక్రియ సెంటాక్ ద్వారా నిర్వహిస్తారన్నారు. కావున అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ నుంచి కొత్తగా తమ దరఖాస్తులను సెంటాక్ వెబ్‌సైట్‌లో పంపాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసినవారు సైతం తిరిగి దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరన్నారు. ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ, మదర్ థెరిస్సా నర్సింగ్ సెంటర్‌లలో నీట్ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తులు చించేసిన ఫ్లెక్స్

జనసేన ఫ్లెక్సీ చించివేత

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని పాదగయ సమీపంలో జాతీయ రహదారిపై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఫొటోలతో కూడిన ఫ్లెక్స్‌ని ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. దీనిపై జనసేన నాయకులు ఎం.శ్రీను, బి.సాయికుమార్, కె.అరవిందు ఫ్లెక్స్ చించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సంఘటనలు పున రావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్‌డిఎ విజయంపై హర్షం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఎన్‌డిఎ కూటమి విజయాన్ని హర్షిస్తూ టిడిపి, జనసేన, బిజెపి నాయకలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెం, పారుపాక గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉమ్మడి వెంకట్రావు, శ్రీను, ఎనుముల రాజా, కోసూరి కృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలకు స్వస్తి పలకాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతా శ్యామ్ రవి ప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రమాణస్వీకారం చేయకముందే విధ్వంసాలకు దిగడం అంబేద్కర్ శిలా ఫలకాలను ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. మహనీయుల విగ్రహాలు స్మృతివనాలు శిలాఫలకాల ధ్వంసం వంటి చర్యలు మానుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. పేర్లు మార్పు చెయ్యానుకుంటే న్యాయ బద్ధంగా మార్పు చేయవచ్చని, భయానక వాతావరణం సృష్టించి రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం మంచి పద్ధతి కాదని తెలిపారు.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
(మైనర్ అయిన రెడ్డి రమ్యశ్రీ వయస్సు 14, కొరకు)
G.O.P.No.15/2024

బిట్వీన్ :
శ్రీమతి రెడ్డి రాజేశ్వరి ...పిటీషనర్
And
నిల్ ...రెస్పాండెంట్స్

పై నెంబరు GOP గ్రంథము నందు మైనర్ **రెడ్డి రమ్యశ్రీ** చెందిన తూ.గో.జిల్లా, రాజమండ్రి వార్డు నెం.12 T.S.No.1214 Extent 116 చదరపు గజములు గల RCC బిల్డింగ్ ఆస్తిని మైనర్ చదువు మరియు పోషన వగైరా అవసరముల నిమిత్తం నేషనల్ బ్యాంకు మరియు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లోన్ కోరుచు, పిటిషనర్ అయిన **శ్రీమతి రెడ్డి రాజేశ్వరి** గారిని మరియు వారి కుటుంబ సభ్యులను గార్డియన్లుగా నియమించమని పై కోర్టు వారిని అనుమతులు కోరుచూ దాఖలు చేసిన GOP గ్రంథములపై ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ది.19-6-2024 తేదీన ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలను తెలియజేసుకొనవలసిందిగా ఈ పత్రిక ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది.

రాజమండ్రి **కె.భరణికుమార్**
తేది.8.6.2024 అడ్వకేట్,రాజమండ్రి.